ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
మంగళవారం 16 సెప్టెంబరు 2025



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్‌ఎండీ రెండు గేట్లు ఎత్తివేత

తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు గేట్లు ఎత్తి కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. అప్పటికే ఎల్‌ఎండీ దాదాపు పూర్తి స్థాయిలో నిండి ఉండటంతో మిడ్ మానేరు నుంచి వస్తున్న నాలుగు వేల క్యూసెక్కుల నీటిని సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఎల్‌ఎండి రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. ఎల్‌ఎండి నుంచి కాకతీయ కాలువ ద్వారా నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల కొనసాగుతుంది. ఎల్‌ఎండీ పూర్తి స్థాయి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.387 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎల్‌ఎండీని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్/తిమ్మాపూర్: కరీంనగర్‌లోని మానేరు జలాశయాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఆయన కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా సోమవారం సాయంత్రం మానేరు జలాశయాన్ని పరిశీలించారు. ప్రస్తుతం వస్తున్న ఇన్‌ఫ్లో, బయటకు వదిలిన నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మెడికల్ కళాశాలకు బస్సు అందజేత



మెడికల్ కళాశాలకు బస్సును అందిస్తున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కుమార్ సోమవారం బస్సును అందించారు. కరీంనగర్ పార్లమెంట్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో బస్సును ప్రిన్సిపాల్‌తో పాటు, విద్యార్థులకు అందించి అందులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాల కొత్తపల్లిలో ఉన్నా, వసతి గృహాలు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. విద్యార్థుల రవాణా సౌకర్యం కోసం బస్సును ఎంపీల్యాడ్స్‌తోపాటు, దాతల నుంచి సేకరించిన నిధులతో బస్సును అందించామన్నారు. జనరేటర్, ఆర్వో ప్లాంటుతో పాటు, కనీస వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

చొప్పదండి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ గౌస్‌ఆలం అన్నారు. సోమవారం చొప్పదండి సర్కిల్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సీఐ ప్రదీప్ కుమార్‌ను అడిగి తెలుసు కున్నారు. రికార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. అండర్ ట్రయల్ కేసుల రికార్డులు, ఫిర్యాదుల రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

- ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ
- రోడ్డు దాటడమే కష్టంగా మారుతున్న వైనం
- అడ్డదిడ్డంగా నడిపే వాహనాలతో ప్రమాదాలు

నగరంలో 'ట్రా'ఫికర్'



కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వాహనాల రద్దీరోజురోజుకు పెరుగుతోంది. నగరం స్మార్ట్‌సిటీ కావడమేకాకుండా శివారులోని పద్మనగర్, చింతకుంట, మల్కాపూర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరె పల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, సదాశివపల్లి, అల్గునూర్‌తో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీ నగరపాలక సంస్థ లో విలీనమయ్యాయి. నగర విస్తీర్ణం, జనాభాతో పాటు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు ప్రధాన రహదారులకే పరిమితమైన వాహనాల రద్దీ, ఇప్పుడు అంతర్గత రోడ్లలో కూడా ఏర్పడింది.

యథేచ్ఛగా ఆక్రమణలు

ప్రధాన రోడ్లలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని దర్జాగా ఓవైపు పండ్లు, మిర్చి బండ్లు, టిఫిన్, పానీపూరి బండ్లు, ఇతర చిరువ్యాపారులు వ్యాపారాలు సాగిస్తున్నారు. చాలా చోట్ల దుకాణదారులు వారి దుకాణాలకు సంబంధించిన బోర్డులను, కొంత మంది అమ్మకాలకు సంబంధించిన వస్తువులను ఫుట్‌పాత్, రోడ్ల పై పెడుతున్నారు. దీనికి తోడు ఆయా దుకాణాలకు, రోడ్డు పక్కన ఉన్న దుకాణాలకు వచ్చే వారు వాహనా లను రోడ్లపైనే నిలిపి వేయ డంతో రోడ్లు చాలా చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నా యి. ఉదయం, సా యం త్రం వేళల్లో ప్రైవేట్ స్కూల్స్, కళా శాలల బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిపి విద్యార్థులను తీసుకెళ్లడం, వదిలి పెడుతుండడంతో ట్రాఫిక్‌జామ్ అవుతోంది.

బిజీగా మారిన యూనివర్సిటీ రోడ్డు



యూనివర్సిటీకి వెళ్లే రోడ్డు

శాతవాహన యూనివర్సిటీ రోడ్డులో గత ఏడాది నగరపాలక సంస్థ నైట్ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేసింది. దీంతో ఇక ఆ రోడ్డు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బిజీగా మారింది. ఓవైపు వాహనాల రద్దీ, మరోవైపు కొంత మంది యువకులు సాయంత్రం, రాత్రి వేళల్లో చెవులు చిల్లులు పడే విధంగా శబ్దంతో బైక్ రైడింగ్ చేస్తున్నారు. దీంతో వాహనదారులే కాకుండా పాదచారులు రోడ్డు దాటేం దుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టరేట్ రోడ్డు, కట్టరాంపూర్, హనుమాన్‌నగర్‌రోడ్డు, హౌసింగ్‌బోర్డు కాలనీ రోడ్డు, కాపువాడ రోడ్డు, భగత్‌నగర్, రాంచంద్రాపూర్ కాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్ల మధ్య డివైడర్లు లేక పోవడంతో వాహనాలు అడ్డుదిడ్డంగా నడుపుతు న్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిపై నగరపాలక సంస్థ, పోలీస్ శాఖలు అధ్యయనం చేసి ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాద నివారణకు స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. సైలెన్సర్లు మార్చి నడిపే బైకులను, బైక్ రేస్‌లను నియంత్రించాలని రోడ్లు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్లపైనే స్కూల్స్, ఫంక్షన్ హాల్స్‌తోపాటు వైన్

(మిగతా 8వ పేజీలో)

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి



విజ్ఞప్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణికి 2021 ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు 27,580 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1,810 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాంటి దరఖాస్తులకు సంబంధించిన సమ ఆచారం అర్జీదారులకు అందజేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్, మున్సిపల్, పంచాయతీశాఖ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి 387 అర్జీలు వచ్చాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాఖడే, లక్ష్మీకిరణ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమేశ్‌బాబు పాల్గొన్నారు.

● నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమం ఉల్లాస్‌లో భాగంగా జిల్లాలో 32,777 మంది నమోదు లక్ష్యంగా నిర్ణయించగా, 69వేల 958 మందిని చేర్పించామని కలెక్టర్ తెలిపారు. హైదరాబాద్ తరువాత స్థానంలో కరీంనగర్ ఉందన్నారు.

సాయుధ పోరాటంపై మాట్లాడే అర్హత బీజేపీకి లేదు

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ఇందుర్తిలో అమరవీరుల స్థూపం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటం గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా మండలశాఖ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం అమరుల స్థూపాల వద్ద ఆయన జెండా ఆవిష్కరించారు. అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటంతోనే తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బైక్ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, నాయకులు గూడెం లక్ష్మి, బోయిని అశోక్, బాబు, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో 250 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రతి నెలా వేతనాలు చెల్లించడంలేదని, ఏదో రూపంలో ఆందోళనలు, నిరసనలు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, ప్రధాన కార్యదర్శి పి కళా వతి, రాజు, రేక, శంకర్, శారద, రాకేష్ కార్మికులు పాల్గొన్నారు.



టీయుసీసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ కార్మికులు

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్ 8

కరీంనగర్ ప్రజావాణిలో హైడ్రామా 6

పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలి

కరీంనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఈనెల 17 నుంచి అక్టోబరు 16 వరకు నిర్వహించనున్న పోషణ మాసోత్సవాలను విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోషణ మాసోత్సవాలపై సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ నెలరోజులపాటు జిల్లాలో విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ పోషకాహారం ప్రాధాన్యాన్ని ప్రజలకు వివరించాలన్నారు. విద్య, వైద్య, పంచాయతీరాజ్, మెప్మా, డీఆర్డీవో తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

డీఈవోగా శ్రీరాంమొండయ్య



జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలను స్వీకరిస్తున్న శ్రీరాంమొండయ్య

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధి కారిగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొం డయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి చైత న్యజైనీ నెలరోజులపాటు సెలవులో వెళ్ల డంతో జిల్లా కలెక్టర్ డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్యకు పూర్తి అదనపు బాధ్యతలతో డీఈవో విధులను అప్ప గించారు. ఆయన సోమవారం బాధ్యతలను స్వీకరించారు.

ఎన్‌సీడీ ప్రోగ్రాం నుంచి ఏఎన్‌ఎంలను మినహాయించాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సీడీ) ప్రోగ్రాం నిర్వహణకు ఏఎన్‌ఎంలను మినహాయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్‌సీడీ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొని స్క్రీనింగ్ టెస్టులతోపాటు ఆఫ్‌లైన్‌లో రిపోర్టులను రెండుసార్లు తయారు చేశారని తెలిపారు. మళ్లీ ఆఫ్‌లైన్‌తోపాటు, ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. ఆన్‌లైన్ చేయాలంటే ఓటీపీ అవసరమని, ఓటీపీ అడిగితే ప్రజలు ఏఎన్‌ఎంలకు చెప్పే పరిస్థితి లేదని అన్నారు. ఇప్పటికే 42 యాప్స్ ఉన్నాయని, వాటితోనే ఏఎన్‌ఎంలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.రోజుకు 10 నుంచి 12 గంటలపాటు పని చేస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు భారత సంపూర్ణ,ప్రధాన కార్యదర్శి స్వరూప,సంతోష,రజిత, మానస, రమాదేవి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అర్బన్ ఏఎన్‌ఎంలు

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారులను కోరారు. ఈమేరకు సోమవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగలను పురస్కరించుకుని నగరంలోని అన్ని జంక్షన్లను రంగులరంగుల విద్యుద్దీపాలతో అలంకరించాలని, బతుకమ్మ ఘాట్ల వద్ద మైదానాన్ని శుభ్రం చేసి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే మార్క్‌ఫెడ్ గ్రౌండ్, అంబేద్కర్ స్టేడియంలో గతంలో మాదిరిగానే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు లైటింగ్, సౌండ్ సిస్టమ్, రామ్‌లీలా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోవద్దని మున్సిపల్ టీపీబీవోను హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు వాల రమణారావు, జంగిలి అయిలేందర్‌యాదవ్, తోట రాములు, బోనాల శ్రీకాంత్, జంగిలి సాగర్, సుడా మాజీ డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు ఎడ్ల అశోక్, గందె మహేశ్, సుధగోని కృష్ణగౌడ్, కోల సంపత్‌కుమార్, నందెల్లి మహిపాల్ పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరికి జీవితఖైదు జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.7 వేలచొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ సోమవారం తీర్పు వెలువరించారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండపల్లి గ్రామానికి చెందిన అంకం మల్లేశం, రాజేశంకు అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు మధ్య పాతకక్షలు ఉన్నాయి. రాజేశంతోపాటు అతడి అత్తమ్మ సరస్వతిని పాతపగల నేపథ్యంలో లక్ష్మీ నారాయణ దాడికి పాల్పడగా కేసు నమోదయింది. మల్లేశం, రాజేశంలతోనే తనపై కేసు నమోదు అయ్యిందనే కోపంతో లక్ష్మీనారాయణ కక్ష పెంచుకున్నాడు. 2016సెప్టెంబరు 9న మల్లేశంను ఎలాగైనా చంపాలనే ఉద్దేశ్యంతో లక్ష్మీనారాయణ అతని భార్య విజయలు ఇద్దరు కలిసి కళ్లలో కారం పొడి చల్లి గొడ్డలితో దాడి చేయగా మల్లేశంకు తీవ్ర గాయాలుకాగా అడ్డువచ్చిన రాజేశంపై దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలైన మల్లేశంను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్సై వెంకటేశ్వర్ రావు కేసు నమోదు చేయగా సీఐ మహేష్ దర్యాప్తు చేశారు. నిందితులైన లక్ష్మీ నారాయణ, విజయలను కోర్టులో హాజరు పరుచగా సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు శ్రీధర్, రాజు, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించగా నేరంరుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షపడడంతో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లందకుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లందకుంటకు చెందిన మోత్కురి సారయ్య గేదెలను మేపడానికి ఓ ప్రదేశానికి వెళ్లగా ఇదే గ్రామానికి చెందిన ఒద్దుల సతీష్‌రెడ్డి ఇక్కడ నా గేదెలు మేస్తాయని ఇటువైపు నీవు గేదెలను తోలు కొని రావద్దని కులం పేరుతో దూషించాడు. సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 15మందికి శిక్ష

తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈమధ్య జరిగిన లోక్‌అదాలత్‌లో భాగంగా మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 ఇసుక అక్రమ రవాణా కేసుల్లో ఎక్సైజ్ మేజిస్ట్రేట్ బానోత్ రాజేశ్వర్ ఒక్కొక్కరికి ఎనిమిదివేల రూపాయల జరిమా నాలతో పాటు ఒకరోజు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ భారత్ చేపించామని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గన్నేరువరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితుడికి సోమవారం అందించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన పెంటి నర్సయ్య తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నానని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా 24గంటల్లో కనుగొని ఫోన్‌ని తనకి అందించినట్లు తెలిపారు.

25 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం

అసంపూర్తిగా రంగపేట ఆర్టీసీ బస్ షెల్టర్

మానకొండూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేట ఆర్టీసీ బస్ షెల్టర్ 25 ఏళ్ల గా పిల్లర్లకే పరిమితం అయింది. మండలంలోని రంగపేట గ్రామంతో పాటు మరో ఎనిమిది గ్రామాలు కమలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం, హన్మకొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కొనసాగేవి. టీడీపీ హయంలో కమలాపూర్ ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్‌రెడ్డి మంత్రిగా కొనసాగారు. రంగపేట గ్రామానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు లేకపోవడంతో కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి నుంచి రంగపేటకు మూడు కిలోమీటర్ల దూరం.

ఇక్కడ దిగిన ప్రయాణికులు గ్రామానికి కాలినడకన వెలుతుండేవారు. ఆర్టీసీ బస్సు వచ్చేంత వరకు గ్రామస్థులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ఉండేవారు. గ్రామానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ముద్దసాని దామోదర్‌రెడ్డి మంత్రి కావడంతో గ్రామస్థుల కోరిక మేరకు బస్‌షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అదే గ్రామానికి చెందిన గోపు ఆనందరెడ్డి అనే వ్యక్తి బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టి పిల్లర్ల వరకు పూర్తి చేశాడు. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



చెట్ల మధ్యన కనిపిస్తున్న బస్టాండ్ కోసం నిర్మించిన పిల్లర్లు

అప్పటి నుంచి 25 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం అయిందని గ్రామస్థులు వాపోతున్నారు. అసంపూర్తి బస్ షెల్టర్‌లో చెట్లు మొలిచి వృక్షాలుగా మారాయి. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు షెల్టర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లా విద్యార్థినులకు పతకాలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అస్మితా ఉమెన్స్ కిక్‌బాక్సింగ్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా ఉమెన్స్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థినిలు రెండు రజత పతకాలు సాధించారు. సోమవారం వరంగల్ జిల్లా కేంద్రం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లా చెందిన లింగం శ్లోకా, అన్నాల్‌దాస్ లక్ష్మీప్రసన్న వివిధ విభాగాలలో పోటీ పడి ప్రత్యర్థులను చిత్తు చేసి ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలను సాధించారు. రజత పతకాలను సాధించిన శ్లోకా, లక్ష్మీప్రసన్నలకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాజంనేయులు కార్యదర్శి మహిపాల్, కోశాధికారి పన్నీరు శ్రీనివాస్ రజత పతకా లను అందించి అభినందించారు. రజత పతకాలను సాధించిన చిన్నారులను కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్, జిల్లా కోచ్ యేనగందుల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతీలాల్ ఉపాధ్యాయులు అభినందించారు.



సాధించిన రజత పతకాలతో విద్యార్థినులు

నిమ్మనపల్లిలో చోరీ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల కనుకయ్య సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. అతడు ఇరవై రోజుల క్రితం మంచిర్యాలలోని కుమారిడి ఇంటికి వెళ్ళాడు. ఆదివారం ఇంటి ప్రహరీ కూలిపోవడంతో స్థానికులు కనుకయ్యకు సమాచారం ఇచ్చారు. సోమవారం అతను వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు తెలిపారు. రూరల్ ఎస్ఐ మల్లేష్, క్లూస్ టీం బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇంట్లో ఎంతవరకు చోరీ జరిగిందనేది ఎలాంటి ఫిర్యాదు రాలేదని, సంఘటనపై విచారణ చేపడుతున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య



కనకయ్య(ఫైల్)

చొప్పదండి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని కనకయ్య(46) అనే హోంగార్డు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కథనం ప్రకారం.. కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కనకయ్య ఆర్థికఇబ్బందులతో బాధపడుతూ ఆదివారం రాత్రి గ్రామశివారులో క్రిమిసంహారక మందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ సివిల్‌ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కనకయ్య మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. హోంగార్డు కనకయ్య మృతదేహానికి రిజర్వ్‌డీఎస్పీ భీంరావు నివాళులర్పించి తక్షణ సహాయంకింద రూ.20వేలు అందజేశారు.

వృద్ధురాలి బలవన్మరణం

వేములవాడ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చల్లా లక్ష్మీ(75) అనేవృద్ధురాలు ఉరివేసుకుని సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉండగా ఆరుసంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో లక్ష్మీ ఒంటరిగా ఉంటున్నట్లు బంధువులు తెలిపారు. వృద్ధాప్యంతో పాటు ఒంటరిగా ఉంటున్న ఆమె మానసికస్థితి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పెద్దకొడుకు గంగాధర్ తనతల్లి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

జగిత్యాల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ నయిముద్దీన్ (50) ఆదివారం అర్ధరాత్రి దారుణహత్యకు గురైనట్లు జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస-గుల్లపేట బైపాస్‌రోడ్డు సమీపంలోని కాల్వలో పడేశారు. మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనస్థలానికి చేరుకొని పోలీసులు హత్యకుగల వివరాలు సేకరించారు. మృతుడు నయిమొద్దీన్ హత్యకు గురైన రోజు రాత్రి సమయంలో అతడిఆటోలో ముగ్గురువ్యక్తులు ఎక్కి జగిత్యాల పట్టణంలో తిరిగినట్లు పోలీసులుగుర్తించారు. సీసీఫుటేజీలద్వారా అనుమానిత వ్యక్తులను గుర్తిస్తున్నామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. మృతుడుసోదరుడు ఇషాక్‌ఉద్దీన్ ఫిర్యాదుమేరకు హత్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని జగిత్యాలరూరల్ సీఐ తెలిపారు.

రూ.7300 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధరరూ.7300పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 45క్వింటాళ్లవిడిపత్తి, 9మందిరైతులు 58క్వింటాళ్ల కొత్తపత్తి, ఆరుగురు రైతులు 14క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగవేలం పాటద్వారా గరిష్ఠధర రూ.7300,కనిష్ఠధరరూ.4వేలు చెల్లించిపత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యువకుడిపై కత్తితో దాడి: తీవ్ర గాయాలు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఏనగందుల గణేష్ అనే యువకుడిపై ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి బస్ డిపో వద్ద ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన ఏనగందుల గణేష్ అనే యువకుడితో జగిత్యాలకు చెందిన రాజేశ్వర్ అనే వ్యక్తికి ఓ ద్విచక్రవాహనానికి సంబంధించి 5వేల రూపాయల కోసం వాగ్వాదం జరిగింది. దీంతో రాజేశ్వర్‌తోపాటు నిఖిల్ అనే వ్యక్తి గణేష్‌ను కత్తితో పొడవగా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి గణేష్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఏనుగందుల సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాపాలన దినోత్సవంలో పతాకావిష్కరణకు ఇన్‌చార్జిల నియామకం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం 17న జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కరీంనగర్ ఉమ్మడిజిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణకు మంత్రులు, ప్రభుత్వవిప్, కార్పొరేషన్ చైర్మన్లను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు జాతీయపతాకావిష్కరణ చేయనున్నారు. జగిత్యాలకు తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్‌చైర్మన్ నిరంజన్, పెద్దపల్లికి రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్‌కమిషన్ చైర్మన్ మహ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ సాహెబ్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు వీరు ఈనెల17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రాల్లో ఉదయం 10గంటలకు జాతీయపతాకాన్ని ఎగురవేయనున్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

- 36 గేట్లు ఎత్తి 1,47,000 క్యూసెక్కులు దిగువకు విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 36 గేట్లు ఎత్తి 1,47,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదకాలువకు 8,000క్యూసెక్కులు, కాకతీయ కాలువకు4,000, సరస్వతీకాలువకు 800క్యూసెక్కులువిడుదలవుతోంది.



దిగువ గోదావరిలోకి పరుగులు పెడుతున్న శ్రీరాంసాగర్ నీరు

రెండు గ్రామాల్లో పోలీసుల దాడులు

- 180 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నలుగురిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి, మద్దిమల్లతండా గ్రామాల్లో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పలు ఇళ్ల సమీపంలో సారా తయారీ కేంద్రాలను గుర్తించారు. నిల్వ చేసిన 180 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే క్వింటాలు ఇప్పపూవు, పాత్రలు, 18 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారుదారులు రాములు, శంకర్, మంజుల, సుజాతలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారా తయారు, విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమకు సమాచారం అందిస్తే వారివివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని ఎస్ఐ లక్ష్మణ్ కోరారు. దాడుల్లో కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.



స్వాధీనపర్చుకున్న సారా ముడిపదార్థాలు, నిందితుడితో ఎస్ఐ లక్ష్మణ్

ఇండియన్ పోస్టల్ రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ సేవలను కొనసాగించాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఎంపిక చేసిన పోస్టాఫీసులు రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లుగా పనిచేస్తున్నాయని, భారతీయ రైల్వేలు పోస్టల్‌శాఖతో సమన్వయంతో ప్రవేశపెట్టిన ఇండియన్ పోస్టల్‌రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ (ఐపీఆర్ఆర్ఎస్) అనే సదుపాయాన్ని కొనసాగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు లేఖ రాశారు. సిద్దిపేటజిల్లా హుస్నాబాద్ సబ్-పోస్టాఫీసులో గతంలో పనిచేస్తున్న ఐపీఆర్ ఆర్ఎస్ సౌకర్యాన్ని పోస్టల్‌శాఖ మూసివేసిందని, దీంతో సమీపంలోని పోస్టాఫీసులో రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడానికి ఈ సదుపాయాన్ని ఆశ్రయించిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని లేఖలో పేర్కొన్నారు. రైల్వే టికెట్ బుకింగ్ కోసం సరసమైన, పారదర్శకమైన సులభంగా అందుబాటులో ఉండే హుస్నాబాద్ చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారన్నారు. ఈ సమస్యను కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, పోస్టల్‌శాఖలోని సంబంధిత అధికారులతో చర్చించి, స్థానిక ప్రజల ప్రయోజనం కోసం హుస్నాబాద్ సబ్-పోస్టాఫీసులోని ఐపీఆర్ఆర్ఎస్ కేంద్రాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

మంథనిరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం కుక్కలు ఏడుగురిని గాయపరిచాయి. అంబేద్కర్, గాంధీచౌక్ ప్రాంతంలో షాపింగ్‌కు వచ్చిన వారిని కుక్కలు కరవడంతో తోట సాయి, చిందం సమీర్, రిషి, జంజర్ల జనార్దన్, కోట నరేందర్, కట్కం స్వప్న, మాచీడి శ్రీధర్‌లకు గాయాలయ్యాయి. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 99 మందిని కోతులు, కుక్కలు గాయపర్చగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకపోవడంతో విద్యార్థులు రోడ్లపై పడుతున్నారన్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల ఫీజులు బకాయిలు పెడితే, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు చెల్లిస్తోందన్నారు. రాష్ట్రంలో 9వేల కోట్ల రూపాయల ఫీజులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వెళ్లితే యాజమాన్యాలు ఆ డబ్బులు వసూళ్ల చేస్తున్నాయన్నారు. సాంఘిక, బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ చార్జీలు ఆరు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. సకాలంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో నాసిరకం వస్తువులను హాస్టళ్లకు సరఫరా చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో డిక్లరేషన్‌లో విద్యార్థులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వాలు మారిన పాత బకాయిలు కట్టాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక పోవడంవల్ల విద్యార్థులతోపాటు, కళాశాలల్లో పనిచేసే సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం బాధ్యత రహిత్యంగా పనిచేస్తుందన్నారు. యూరియా కొరత రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లనే ఏర్పడిం దన్నారు. ఒక సీజన్ కంటే ముందే డీడీలు కట్టి, గోదాముల్లో స్టాక్ నిల్వ చేసుకోవాలి, కానీ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం తోనే కొరత ఏర్పడుతోందన్నారు. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, కొన్ని వందలసార్లు నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చారన్నారు. ఒకటే పరీక్ష కేంద్రంలో వందమంది ఎంపికైతే మీ నిర్వహణ ఎట్లా ఉందో అర్థమైందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, సంపత్ రావు, శ్రీరామ్, గౌతమ్‌రెడ్డి, కళాధర్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్, సురేందర్‌రాజు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్ ప్రజావాణిలో హైడ్రామా

- తన భర్త వదిలి వెళ్లిపోయాడని, ఉద్యోగం ఇవ్వాలని నేలపై కూర్చుని మహిళ నిరసన
- కాసేపటికి ప్రత్యక్షమైన భర్త
- తాను బతికుండగానే చనిపోయానని సర్టిఫికెట్ తీసుకుందని ఆరోపణ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో హైడ్రామా చోటు చేసుకుంది. కలెక్టర్ పమేలా సత్పతి ప్రజావాణి నిర్వహిస్తుండగా మానకొండూరు మండలం పోచంపల్లికి చెందిన భారతి అనే మహిళ దరఖాస్తు చేతపట్టుకొని వచ్చింది. తన భర్త తనను వదిలి వెళ్లిపోయాడని, తన భూమి ముంపునకు గురైందని తెలిపింది. తన దీన పరిస్థితిని చూసిన గత కలెక్టర్ తనకు ఉద్యోగావకాశం కల్పించాలని సూచించారని, తనకు ఉద్యోగం ఇప్పించాలని నేలపై కూర్చొని నిరసన తెలిపింది. పోలీసులు ఆమె వద్దకు చేరుకొని సమస్యను కలెక్టర్‌కు చెప్పుకోవాలని, కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేస్తారంటూ చెప్పారు. ఆమె వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగింది. కొద్ది సేపు ఆమెతో మాట్లాడిన పోలీసులు చివరకు ఆమె నుంచి వినతిపత్రం స్వీకరించి అక్కడినుంచి బలవంతంగా బయటకు పంపించారు. కాసేపటికే భారతి భర్త పిల్లి రాజమౌళి ప్రజావాణికి వచ్చాడు. ఇప్పటి వరకు నిరసన తెలిపిన భారతి భర్త తానేనని అధికారులకు తెలిపాడు. తాను బతికుండగానే చనిపోయినట్లు తప్పుడు డెత్ సర్టిఫికెట్ పొంది భారతి వితంతు పెన్షన్ తీసుకుంటుందని చెప్పాడు. తమకు పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత తనను విడిచిపెట్టి వెళ్లిందన్నాడు. తనపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించిందని తెలిపాడు. ఈ మధ్య కాలంలోనే తనకు తెలియకుండా తన తండ్రి నుంచి వచ్చి భూమిని ఆమె పేరుపై చేయించుకుందన్నాడు. ఇప్పుడు ఉద్యోగం కోసం అంటూ అధికారుల చుట్టూ తిరుగుతుందన్నాడు. కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.





బైఠాయించిన భారతికి నచ్చజెప్పుతున్న పోలీసులు, భారతి భర్త రాజమౌళి

రహదారిపై కొండచిలువ హల్‌చల్..

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారుజామున జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై కొండ చిలువ సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రధానరహదారిపై ఆరు అడుగుల కొండ చిలువ కనిపించడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు, గ్రామస్థులు ఆందోళనకు గురై వెంటనే అధికారులకు సమాచారం అందజేశారు. సుమారు రెండుగంటలపాటు శ్రమించి కొండచిలువను పట్టుకొని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కొండ చిలువ

ఇసుక డంపు స్వాధీనం

తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వఉంచిన భారీ ఇసుక డంపును ఎల్ఎండీ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామశివారులో ఇసుకడంపు ఉన్నట్లు సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తోకలిసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాదాపు 80ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపు అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిపారు. ఇసుకడంపును స్వాధీనం చేసుకొని తిమ్మాపూర్ తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్

భారీ వర్షానికి కూలిన ఇల్లు

సైదాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏలూరి లింగారెడ్డి, ఏలూరి ఆదిరెడ్డిలకు చెందిన ఇల్లు అయిదు రోజులక్రితం కురిసిన భారీవర్షానికి గోడలు తడిచి కూలిపోయింది. అధికారులు పరిశీలించి తమకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని బాధితులు కోరారు.



బొమ్మకల్‌లో కూలిన ఇల్లు

మానసాదేవి ఆలయంలో సినీ నటి శ్రీలక్ష్మి


ఆలయంలో సినీ నటి శ్రీలక్ష్మి

గన్నేరువరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి అమ్మవారి సోమవారం సినీ హాస్య నటి శ్రీలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపును కట్టారు. అనంతరం ఆలయంలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. అమ్మవారి మహిమల గురించి తెలుసుకుని స్వయంగా దర్శించుకునేందుకు వచ్చినట్లు శ్రీలక్ష్మి తెలిపారు. ఆలయ అర్చకులు అమర్‌నాథ్‌శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మిని ఘనంగా సన్మానించి లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఎస్సారార్‌లో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్‌లో పరిమిత సీట్లు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ బీఎస్సీ లైఫ్ సైన్స్ బీకాం రిటైల్ ఆపరేషన్ కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ అడ్మిషన్స్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ తెలిపారు. దోస్త్ స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందడానికి మంగళవారం మాత్రమే అవకాశం ఉందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో



బోయినపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు సోమవారం 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7,450 మానేరు, మూలవాగు ద్వారా 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400, మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.196 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,60 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.

సామాజిక చైతన్యమే లక్ష్యం

- సేవా కార్యక్రమాల్లో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు
- సైబర్ నేరాలు.. మహిళా సాధికారతపై గ్రామీణులకు అవగాహన


ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల బృందం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యమే లక్ష్యంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌లు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల స్థితిగతులు పరిశీలిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు గుర్తింపును చాటుకుంటున్నారు.

గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవడానికి ఎన్ఎస్ఎస్ శిబిరాలు వేదికలవుతున్నాయి. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఈ నెల 12వ తేదీ నుంచి జాతీయ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పది మందితో ఓ గ్రూప్‌గా ఐదు గ్రూపులుగా విడిపోయి సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను పారదోలుతూ అవగాహన కల్పిస్తున్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకండి

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.


సర్వే చేస్తున్న వలంటీర్లు

శ్రమదానంతో చెత్తాచెదరం లేకుండా శుభ్రం చేశారు. రోడ్డు పక్కన ముళ్ల పొదలను తొలగించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజా సమస్యలపై నివేదిక తయారు చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకుని ఆర్థికంగా, సామాజికంగా, విద్యారంగంలో ముందుండాలని తెలుపుతున్నారు. మహిళా సాధికారత గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహించిన కార్యక్రమాలు గ్రామస్థులను ఆలోచింపజేసే విధంగా ఉంటున్నాయి.


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

ఉత్సాహంగా సేవలందించారు

వాణిశ్రీ , ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్



శ్రమ అంటే ఏమిటో తెలియని విద్యార్థులు ఉత్సాహంగా, హుషారుగా సేవలందించారు. గ్రామంలో రోడ్లను ఊడ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థులు సామాజిక సేవకులుగా ఎదగడానికి దోహదపడుతుంది.

సేవా భావం పెంపొందుతుంది

జయ, ప్రిన్సిపాల్, గిరిజన మహిళా డిగ్రీ కళాశాల



చదువుకునే దశలోనే విద్యార్థులకు ఈ శిబిరాలతో సేవా భావం పెంపొందుతుంది. ఎన్ఎస్ఎస్ శిబిరంలో నేర్చుకున్న విషయాలు గుర్తుండిపోతాయి. శ్రమ శిక్షణ, సామాజిక సేవ విద్యార్థుల్లో అలవడి భవిష్యత్తులో మంచి పౌరులుగా మార్గదర్శకులుగా నిలుస్తారు.

కొత్త విషయాలు నేర్చుకున్నాం

సంధ్య, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్



శిబిరం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. గ్రామంలో శ్రమదానంతో రోడ్లను శుభ్రపర్చడం సామాజిక బాధ్యతగా గుర్తించారు. వారంలో ఒకరోజు గ్రామంలోని యువత స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలి.

చక్కని అనుభూతి ఇచ్చింది

అంజలీ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్



ఎన్ఎస్ఎస్ శిబిరం చక్కని అనుభూతిని ఇచ్చింది. పదిమదితో కలిసి పని చేయడంతో బిడియం పోయి నూతన ఉత్తేజాన్ని నింపింది. సేవా కార్యక్రమాలు చేయడానికి శిబిరం దారి చూపింది.

కొండగట్టులో ఉట్టి వేడుకలు


ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, అర్చకులు

మల్యాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి అనంతరం నెల రోజులకు యేటా ఇక్కడ వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో..


ధర్మపురిలో కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రధాన ఆలయంలోని బలరామకృష్ణుని వద్ద గల స్వామి వారికి ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

భక్తుల రక్షణకు పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు

- సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్‌పై ప్రత్యేక నియంత్రణ
- ఎస్పీ మహేష్ బి. గితే


రాజన్న ఆలయ నమూన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు పోలీసు శాఖ పటిష్ఠ చర్యలు చేపడుతుందని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. రాజన్న ఆలయ సమావేశ మందిరంలో సోమవారం భక్తుల భద్రత, ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల సమన్వయంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఏఎస్పీ శేషాద్రినిరెడ్డితో కలిసి ఈవో రమాదేవి భీమేశ్వర ఆలయంలో చేపట్టే అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయాధికారులను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణం, గోపుర ద్వారాలు, క్యూలైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వీధులలో సీసీ కెమెరాలను విస్తృతంగా అమర్చాలన్నారు. భక్తులు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తూ నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రధాన రహదారుల్లో డైవర్షన్‌ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్య, ఈవో రమాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగులను సన్మానించిన ఈవో రమాదేవి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఇంజనీరింగ్ ఉద్యోగులను, సిబ్బందిని ఇంజనీర్స్ డే సందర్భంగా ఆలయ సమావేశ ఈవో రమాదేవి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, జయకుమారి, అశోక్‌కుమార్ ఆలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రజలకు చేరువలో

పాస్‌పోర్టు సేవలు

- ప్రతీ రోజు 500 స్లాట్స్ కల్పించేలా చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే శాశ్వత భవనం నిర్మిస్తాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- అప్‌గ్రేడ్ పాస్‌పోర్ట్ కేంద్రం ప్రారంభం


కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్‌తో పాస్‌పోర్టు కార్యాలయ ఉద్యోగులు


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు సేవలను ప్రధాని నరేంద్ర మోదీ సామాన్యుల దరి చేర్చారని, గతంలో పాస్‌పోర్ట్ పొందాలంటే నెలల తరబడి సమయం పట్టేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆధునికీకరించిన అప్‌గ్రేడ్ పాస్ పోర్ట్ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంతి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో కరీంనగర్‌తో సహా 5 పాస్ పోర్ట్ సేవా కేంద్రాలున్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 2014లో కరీంనగర్ పాస్ పోర్టు సేవా కేంద్రం నుంచి సేవలు ప్రారంభమయ్యాయన్నారు.

పాస్ పోర్ట్ సేవల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫార్చ్యూన్ మాల్‌లో పాస్ పోర్టు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఇప్పటికే రోజుకు సగటున 230 స్లాట్లను నిర్వహిస్తోందని, ఈ సంఖ్యను 500కు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే శాశ్వత భవనం కట్టించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేయటం, ఆధునీకరించి, నూతనభవనంలోకి మార్చుకోగలిగామంటే అందుకు ప్రధాన కారణం తెలంగాణ రీజనల్ పాస్ పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ సహకారమే అన్నారు. ఆమె అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పాస్ పోర్ట్‌సేవా కేంద్రం అప్‌గ్రేడేషన్ చేయడం సంతోషకరమన్నారు. 2009-14లో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పాస్ పోర్ట్ కార్యాలయాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ పాస్‌పోర్ట్‌కి వెళ్తే ఉదయం 4 గంటలకు లైన్‌లో నిలబడాల్సి వచ్చేదని, ఇప్పుడు కరీంనగర్‌లో రీజనల్ పాస్ పోర్ట్ కార్యాలయం ద్వారా త్వరగా పాస్ పోర్ట్ పని పూర్తవుతుందని అన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, పాస్ పోర్ట్ ఆఫీసర్, జాయింట్ సెక్రెటరీ, మాజీ మేయర్ సునీల్‌రావు, వాసాల రమేష్, మధుకర్, కొట్టె మురళి, బేతి మహేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన 12వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ యోగా పోటీల్లో జిల్లాకు బంగారు, రజత, కాంస్య పతకాలు వచ్చాయి. సోమవారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో మొత్తం 185 మంది క్రీడాకారులు పాల్గొనగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 35 - 45 సంవత్సరాలలోపు విభాగంలో ఓరగంటి రామకృష్ణ బంగారు పతకం, 30 - 35 సంవత్సరాలలోపు విభాగంలో బి వినోద్ రజత పతకం, 18 - 21 సంవత్సరాలలోపు విభాగంలో పసుపుల ప్రణయ్ బంగారు పతకం, వీ సృజన 4వ స్థానంలో నిలిచారు. అక్టోబరులో చండీఘడ్‌లో జరిగే జాతీయస్థాయి సీనియర్ యోగా పోటీలలో వీరు పాల్గొనున్నారు. బంగారు, రజత పతకాలను సాధించిన రామకృష్ణ, వినోద్, ప్రనయ్, సృజనలను జిల్లా ఎస్పీ మహేష్ బీ. గితే, అడిషనల్‌ఎస్పీ చంద్రయ్య, యోగ అసోసియేషన్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్,జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ అభినందించారు.

వేములవాడ ఆలయంపై స్పష్టత ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం మూసివేతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామివారి అంతరాలయంలోని పరివార దేవతలను కదిలించడానికి అధికారులు సిద్ధమవుతున్నారని, అలాంటప్పుడు ఆలయ ఆవరణలోని దర్గా సంగతి ఏమిటో ముందుగా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ దేవతా విగ్రహాలను కదిలించి దర్గాను ముట్టుకోకుండా అలాగే ఉంచితే ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ రాజన్న ఆలయ మూసివేతపై స్పష్టమైన ప్రకటన చేయలేదని, దసరా తర్వాత ఆలయాన్ని మూసి వేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని ఏ రోజు నుంచి మూసి వేస్తారో, ఎన్ని మాసాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి తిరిగి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజన్న ఆలయం మీద ఆధారపడి వేల కుటుంబాలు పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయని, అధికారుల తీరు చూస్తే నాలుగైదు సంవత్సరాల పాటు అభివృద్ధి పనులు కొనసాగే విధంగా కనిపిస్తోందని, ఇలాగైతే ఆలయం మీద ఆధారపడి బతుకుతున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని అభివృద్ధి విషయంలోనే భక్తులకు, ప్రజలకు ప్రభుత్వం సరియైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు రేగుల మల్లికార్జున్, కృష్ణస్వామి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

- కార్మికుల వెల్ఫేర్ బోర్డు జీవో నంబరు 12ను సవరించాలి
- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు జీవో నంబరు 12ను ప్రభుత్వం సవరించాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం శివనగర్ శివాలయం ఫంక్షన్ హాల్‌లో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా మూడవ మహాసభకు ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు దేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన అనేక ఐక్య పోరాటాల ఫలితంగా 1996లో భవన నిర్మాణ కార్మిక చట్టం ఏర్పడిందన్నారు. దేశవ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను సాధించుకున్నామన్నా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ప్రవేశ పెట్టిన విధానాల వలన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికులకు సరియైన ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధులను పక్క దారి పట్టించే విధంగా వెల్ఫేర్ బోర్డు స్కీంలకు సంబంధించి ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పే విధంగా తీసుకొచ్చిన జీవో నంబరు 12 వలన కార్మికుల తీవ్రంగా నష్టం జరుగుతుందన్నారు. సమస్య పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో కార్మికులందరినీ ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

అనంతరం మహాసభలో జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ పోరాటాలపై కార్యచరణను రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపెల్లి రాజమల్లు, కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, కమిటి సభ్యులు బిక్షపతి, శ్రీదర్, శ్రీనివాస్, రాజెల్లయ్య, నరేందర్, ప్రభాకర్, వెంకటి, అశోక్, నరసింహులు, అంజయ్య, రాజు, రాములు, బాలవ్వ, నరసయ్య పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్


పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య మానేరు వాగు

ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగు

నిలిచిన రాకపోకలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య ఉన్న మా నేరు వాగు సోమవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రహదారిపై పొంగిపొర్లుతోంది. దాంతో ఆ రోడ్డు గుండా వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్, పోలీసులు వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. వాగు వద్ద అడ్డుగా గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను నిలిపారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఎవరూ వాగు ప్రవాహంలోకి వెళ్లకూడదని తహసీల్దార్ సుజాత, ఎస్ఐ రాహుల్‌రెడ్డి సూచించారు.

నగరంలో ట్రా'ఫికర్'

(5వ పేజీ తరువాయి)

షాపులు, మద్యం దుకాణాలకు కూడా అనుమతి ఇవ్వడంతో వాటికి పార్కింగ్ స్థలం లేక రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో కూడా ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఓవైపు ద్విచక్రవాహనాలు, మరోవైపు స్కూల్‌బస్సుల, ఇంకోవైపు ఆటోలు, కార్లు ఇలా రోడ్లన్నీ రద్దీగా మారుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు ఇప్పటికే మంకమ్మతోట పాత లేబర్ అడ్డా, కమాన్ జంక్షన్, విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం, ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట ఉన్న రోడ్లను వన్‌వేగా మార్చారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వెలిచాల పూజలు



పూజల్లో పాల్గొన్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కరీంనగర్ కమాన్ చౌరస్తాలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తోజు రామ్‌కుమార్, ధర్మకర్తలు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రాజేందర్‌రావును సన్మానించారు. మాజీ కార్పొరేటర్లు మాచర్ల రజిత ప్రసాద్‌గౌడ్, కోటగిరి భూమాగౌడ్, స్వర్ణకార సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ట జగన్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తోజు రామ్ కిరణ్ పాల్గొన్నారు.

గ్రామ పాలన ఆఫీసర్ల నియామకం

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న రెవెన్యూ వ్యవస్థను తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తం గ్రామ పాలన ఆఫీసర్ల పేరిట గ్రామ అధికారులను నియమించారు. వీఆర్‌వో వ్యవస్థలానే ప్రస్తుతం అదే పనులు చేపట్టనున్నారు. రూరల్ మండలంలో రెవెన్యూ గ్రామ పరిధిలో 18 మంది గ్రామ పాలన అధికారులు నియామకం అయ్యారు ఇందులో సోమవారం 13 మంది తహసీల్దార్‌ను రాజేష్‌ను కలిసి విధుల్లో చేరారు. వీరికి తహశీల్దారు పనులపై అవగాహన కల్పించారు.

ప్రైవేట్ కళాశాలల హాస్టళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ప్రైవేట్ ఇంటర్మీడియెట్ కళాశాలల హాస్టళ్లు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి తెలిపారు. కోటా జూనియర్ కళాశాల, ఎస్ఆర్ జూనియర్ కళాశాల హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. యాజమాన్యానికి నోటీస్‌లు జారీ చేశామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నియోజకవర్గ పరిధిలోని 184 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పంపిణీ చేశారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 41,60,000 విలువ చేసే చెక్కులను అందజేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసనలు

గణేశ్‌నగర్/తిమ్మాపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను విడుదల చేయాలని ప్రైవేట్ డిగ్రీ, పీజీ, కళాశాలల యజమాన్యాలు సోమవారం నిరసన తెలిపాయి. ఈ మేరకు సోమవారం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేశారు. తిమ్మాపూర్ మండల కేంద్రంలోని శ్రీ చైతన్య, జ్యోతిష్మతి, వాగేశ్వరి ఇంజనీరింగ్, ఫార్మసీ, పీజీకళాశాలల యాజమాన్యాలు బంద్‌ను పాటించాయి.

డీట్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

జమ్మికుంట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉద్యోగాల కోసం డీట్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ అన్నారు. సోమవారం కళాశాలలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ ఆఫ్ తెలంగాణ(డీట్) యాప్‌పై విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. టీఎస్ కేసీ కో-ఆర్డినేటర్ ఉమాకిరణ్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్, డాక్టర్ కె రాజేంద్రం, డాక్టర్ గణేష్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంల ముందస్తు అరెస్టు

ఇల్లందకుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేసే ఏఎన్ఎంలను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. హైదరాబాద్ హెడ్‌ఆఫీస్ కార్యాలయ ముట్టడికి బయలు దేరుతున్నారని సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సిల్వర్ జూబ్లీ మహాసభలను విజయవంతం చేయండి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అక్టోబరు 4,5 తేదీల్లో నిర్వహించతలపెట్టిన సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ కరీంనగర్ జిల్లా సిల్వర్ జూబ్లీ ఉత్సవ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు ఉద్యోగులు, కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు.

మహిళా డిగ్రీ, పీజీ కాలేజీకి సావిత్రిబాయి పేరు పెట్టాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కాలేజీకి సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలని బీమ్‌ఆర్మీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినిపల్లి చంద్రయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అంద జేశారు.

నియామకం



సంపత్‌కుమార్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తకొండ సంపత్‌కుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘంటా చక్రపాణికి వెలిచాల పరామర్శ

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి సోదరుడు ఘంటా అశోక్ సత్య నారాయణ ఇటీవల మృతి చెందగా సోమవారం కరీంనగర్ విద్యారణ్యపురిలోని నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ ఘంటా కళ్యాణి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రోత్సహిస్తే జాతీయ స్థాయిలో రాణిస్తారు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకత చిన్నారులకు మనం ప్రేరణ కల్పిస్తే రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తారని కరీంనగర్ మండల విద్యాధికారి పి.కృష్ణగోపాల్ అన్నారు. సోమవారం నగరంలోని సుభాష్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో కరీంనగర్ మండల స్థాయి కళా ఉత్సవ్-2025ను నిర్వహించారు. దాదాపు 28 పాఠశాలల నుండి ఈ ఉత్సవాలకు 500లకుపైగా విద్యార్థులు హాజరయ్యారన్నారు.

కరీంనగర్ రూరల్: చామనపల్లి రైతు వేదికలో సోమవారం విద్యార్థులకు కళారంగాల్లో పోటీలు నిర్వహించినట్లు ఎంఈవో రవీందర్ తెలిపారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన గంగుల సురేష్(40) సోమవారం తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ మూడో థానా సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సురేష్ సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన నాగం బీరయ్య(50) అనే వ్యక్తి చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడని కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. కొక్కెరకుంటకు చెందిన బీరయ్య ఆదివారం రేకుర్తి గ్రామ శివారులోని ఎల్లమ్మగుడి దారిలో పురుగు మందుతాగగా ఆసుపత్రిలో చేరాడు. మానసిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య

యూరియా సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే గంగుల కమలాకర్



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): రైతులకు యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు.యూరియా కొరతపై కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ ప్రధాన రహదారిపై సోమవారం రైతులు వినూత్న నిరసన తెలిపారు. యూరియా సంచులను పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మహిళలు యూరియా బస్తాలపై బతుకమ్మను పెట్టి బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతోనే యూరియా కొరత వచ్చిందన్నారు. రైతన్నలు లైన్‌లో చెప్పులు, రాళ్లు పెట్టి గంటల కొద్దీ నిరీక్షిస్తున్నారన్నారు. యూరియా కొరతపై బతుకమ్మ ఉద్యమం చేపడతామన్నారు. ప్రస్తుతం వరి దొడ్డు రకం పొట్టదశకు వచ్చిందని ఈపొట్ట దశకు వచ్చిన పంటకు పొటాషియం, యూరియా కలిపివేయాల్సి ఉందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని, రైతులను పట్టించునే పరిస్థితిలో లేవని అన్నారు. అనంతరం గంగులకమలాకర్‌తోపాటు పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. కరీంనగర్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు తోట తిరుపతి. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, వేల్పుల నారాయణ, మాజీ ఉప సర్పంచ్ సుంకి శాల సంపత్ రావు, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, శ్రీకాంత్, మహేష్, నాయకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని దుకాణాలకు యూరియా వచ్చింది. విషయం తెలుసుకున్న రైతులు దుకాణాల ముందు క్యూ కట్టారు.



బతుకమ్మ ఆడి నిరసన తెలుపుతున్న మహిళలు

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం రామడుగు మండలానికి చెందిన సంబంధించిన 26 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది రానున్న రోజుల్లో మరెన్నో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. గోపాల్‌రావు పేట ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేని తిరుమల, ప్యాక్స్‌చైర్మన్ ఒంటెల మురళీ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈవో రంగనాథశర్మ, ఎస్ఐ రాజు, ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్, పద్మజ, దత్తాత్రేయ, ఎల్లయ్య, భగవంతయ్య, ఎంపీడీవో రాజేశ్వరి, మాజీఎంపీపీ, రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, కోల రమేష్, అంజని ప్రసాద్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సత్యం, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుపురం పరశురామ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, నగర నాయకులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు మానేరు విద్యార్థులు



అభినందిస్తున్న మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో జరగనున్న 69వ జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా పోటీలకు జిల్లాలోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీఈటీ సిరివేరి మహేందర్ తెలిపారు. ఇటీవల కరీంనగర్ కేంద్రంగా పలు వేదికల్లో అండర్-14, 17 బాలబాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీల్లో రాణించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరితారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శైలజారెడ్డి, పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, జహదే పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రారంభిస్తున్న ఢిల్లీ డిఫెన్స్ అకాడమి చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఢిల్లీ డిఫెన్స్ అకాడమి చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం రేకుర్తిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమిలో జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి మానసికంగా ధృడంగా ఉండాలంటే క్రీడలు దోహదం చేస్తాయన్నారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి గంగాధర్, ఢిల్లీ డిఫెన్స్ అకాడమి చైర్మన్ కొత్త సతీష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కొట్టె చంద్రశేఖర్, యువజన క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్ధన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ బి వేణుగోపాల్, గిన్నె లక్ష్మణ్, శంకరయ్య, బాబు శ్రీనివాస్, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా విక్రయాల పరిశీలన

కరీంనగర్ రూరల్ ,సెప్టెంబర్ (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాగ్య లక్ష్మీ కరీంనగర్, దుర్శేడ్ వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా బస్తాల పంపిణీ, విక్రయాలను పరిశీలించారు. నిల్వలు, విక్రయాల రిజిస్టేషసన్లను తనఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో అవసరానికి అనుగుణంగా యూరియా పంపిణీ చేస్తామన్నారు. ఇప్పటి వరకు సీజన్‌లో మొత్తం 41,500 మెట్రిక్ టన్నులు యూరియా అవసరమగా ఇప్పటి వరకు 30వేల టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఆగస్టులో యూరియా స్టాక్ కేటాయింపులో కొంత జాప్యం జరిగినట్లు, తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ తోటతిరుపతి, ఈవో సత్యం, ఎఈవో స్వర్ణలత పాల్గొన్నారు.

వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చొప్పదండి/మానకొండూర్/ గన్నేరువరం/ రామడుగు/ జమ్మికుంట రూరల్/ చిగురుమామిడి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు పింఛన్‌ను పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని మండలాల్లో ఎంఆర్‌వో కార్యాలయం ఎదుట వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెల్మ బాపురెడ్డి, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కపల్లి పౌల్ మాట్లాడుతూ వికలాంగుల పింఛన్ 4నుంచి 6వేలకు, ఆసరా పింఛన్ 2నుంచి 4 వేలకు పెంచుతామని చెప్పి మాట మార్చారని అన్నారు. ఆయా మండలాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. చొప్పదండిలో నాయకులు కంది మల్లయ్య, దేవదాసు, లత, రాజేశ్వరి, మానకొండూర్‌లో కనుకం కొమురయ్య, సిరిగిరి ఐలయ్య, కసిరెడ్డి జగ్గారెడ్డి, గన్నేరువరం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేపాకబాబు మండల ఇన్‌చార్జి నర్సయ్య, బొడ్డు శ్రీనివాస్, కొలుపుల మహేందర్, రామడుగు, జమ్మికుంట మండలాల్లో వీహెచ్‌పీఎస్ నాయకులు మర్రి కుమార్, చిమ్మల్ల శ్రీని వాస్, జనార్దన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అని ల్ మాదిగ, కొత్తూరి రాజన్న, చిగురుమామిడిలో ఎమ్మార్పీఎస్ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎస్‌జీఎఫ్ క్రీడాకారులకు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, వీఎన్ ఆర్ ఫౌండేషన్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిన్నె లక్ష్మణ్‌కు క్రీడా దుస్తులు అందించారు.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు లేదా?

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కులేదా అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. సోమవారం ఆత్మహత్యకు పాల్పడి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బండారి శ్రీనివాస్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సోషల్ మీడియా ద్వారా అడిగినందుకు బండారి శ్రీనివాస్‌పై పోస్టులు పెడతావా అంటూ ఎమ్మెల్యేపై అక్రమ కేసు బనాయించారని, మల్యాల ఎస్సై ఇబ్బం దులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సై సురేష్ థర్డ్ డిగ్రీ ప్రయోగించారని, అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి రాత్రి వదిలి పెట్టారని ఆరోపించారు. మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

హైదరాబాద్ బస్సు ప్రారంభం

జమ్మికుంట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట బస్టాండ్ నుంచి ఉప్పల్ (హైదరాబాద్) వరకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు పునఃప్రారంభమైనట్లు హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ సోమవారం తెలి పారు. ప్రతీ రోజు ఉదయం 6గంటలకు జమ్మి కుంట బస్టాండ్ నుంచి బస్సు బయల్దేరు తుందని, అనివార్య కారణాలతో కొంతకాలం నిలిచి పోయిందని, ఇప్పటి నుంచి యథావిధిగా నడుస్తుందని పేర్కొన్నారు.

యూరియా కోసం రైతుల తిప్పలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నెలకొన్న యూరియా సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మానకొండూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొరత తీవ్రంగా ఉన్నప్పటికీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానారాయణ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించకపోవడం సిగ్గుచేటన్నారు. మాజీజడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు శాతరాజు యాదగిరి, బోడ రాజశేఖర్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు ఉన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో చేపట్టిన జంక్షన్ల సుందరీకరణ పనులలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి. సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లు దాటిన తరువాత మున్సిపల్ అధికారులు టెండర్ రీ షెడ్యూల్ చేసి కాంట్రాక్టర్ బిల్లు పెట్టడం చూస్తుంటే ఎంత అవినీతి జరుగుతుందో అర్థమవుతుందన్నారు.

● సంక్షిప్తంగా..

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జాతీయ సేవాసంస్థ ప్రత్యేక శిబిరంలో సోమవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సంస్థవిభాగం ప్రోగ్రాం ఆఫీసర్ కె గీతారాణి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీటీచర్లకు నగరంలో మూడురోజులపాటు పోషణ బి పడాయి బి మీద శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీడీపీవో తెలిపారు.

మానకొండూర్: మానకొండూర్ ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం మండలస్థాయి టిఎల్ఎం మేళా ఘనంగా జరిగింది.

గన్నేరువరం: మండలానికి చెందిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అటెండర్, స్వీపర్, వాచ్‌ఉమెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈవో కడుదుల రామయ్య సోమవారం ఒకప్రకటనలో తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో యాత్రదానం పథకాన్ని సోమవారం ప్రారంభించినట్లు డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌లోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సరిత జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ శంకర ఆసుపత్రి సహకారంతో ఉచితకంటి వైద్యశిబిరం నిర్వహించారు.

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా తూముల మోహన్‌రావు, కార్యదర్శిగా బుర్ర విఠల్‌రావు, కోశాధికారిగా దేవునూరి సాంబయ్య, అసోసియేట్ అధ్యక్షుడుగా కలకొండ శ్రీధర్‌రావు, గౌరవ అధ్యక్షుడుగా రామనాథం, కార్యవర్గసభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన బీజేపీ మైనార్టీ నాయకుడు అబ్దుల్ అఖిల్ గుండెపోటుతో మృతిచెందగా సోమవారం ఆయన పార్థివదేహానికి ఎంపీ ఈటల రాజేందర్ నివాళి అర్పించారు.

ఇల్లందకుంట: మండలంలో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబాలను మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సోమవారం పరామర్శించారు.

శంకరపట్నం: కోతులను తరిమేందుకు కరీంపేట గ్రామస్థులు కలిసికట్టుగా ప్రయత్నం చేయగా ఫలించలేదు. దీంతో గ్రామస్థులు చేసేదేమీ లేక ఇంటి ముఖం పట్టారు.

భగత్‌నగర్: రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో హిందీదివస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

-రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ సభ్యుడు బండ గోపాల్‌రెడ్డిని క్లబ్‌సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు.

-రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్‌డే వేడుకలను నిర్వహించారు.

-కొత్తపల్లి నుండి కొక్కెరకుంట వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఫకృద్దీన్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

-కొత్తపల్లి మండలం కమాన్‌పూర్‌లో ప్రభుత్వభూమిని కబ్జాచేసినవారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

కరీంనగర్ టౌన్: నగరంలోని సప్తగిరికాలనీ కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయిస్తున్న సిబ్బందిపై చర్య తీసుకోవాలని బోనగం శంకర్‌గౌడ్ జిల్లా కలెక్టర్‌ను కోరారు.

చొప్పదండి: చొప్పదండిలోని బాలుర జడ్పీ ఉన్నతపాఠశాలలో జాతీయ హిందీదివస్ ఘనంగా నిర్వహించారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తిలో ఆశవర్కర్ నియమించాలని గ్రామస్థులు కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.

గణేశ్‌నగర్: కరీంనగర్‌లో గణేశ్‌నగర్ హనుమాన్ చౌరస్తా వద్ద నెలకొల్పే దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలపోస్టర్‌ను కరీం నగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమవారం ఆవిష్కరించారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



జడ్పీ ఆవరణలో నివాళులర్పించిన ఇంజనీర్లు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): జడ్పీ పంచాయతీరాజ్ కరీంనగర్ రీజియన్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జడ్పీ ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. పీఆర్ ఎస్ఈ కె.లచ్చయ్య, ఈఈ టీభూమేశ్వర్, డీపీఆర్ఈ ఎంఎ రెహమాన్, పెద్దపల్లి ఈఈ శంకరయ్య, డీఈ ఈలు చిన్నయ్య, జనార్దన్, రాజేంద్ర ప్రసాద్, రవిప్రసాద్, మంజుల భార్గవి, రాజే శ్వర్ ప్రసాద్, రమణారెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మోక్షగుండం విశ్వే శ్వరయ్యను ఇంజనీర్లే కాకుండా ఉద్యోగులందరూ ఆదర్శంగా తీసు కోవాలని రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్య క్షుడు మారం జగదీశ్వర్ కోరారు. సోమవారం మండలంలోని ఎల్ఎండీ కాలనీలో కరీంనగర్ ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యలయం ఆవరణలో నివాళులు అర్పించారు. జిల్లా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కరీంనగర్ రూరల్ : బొమ్మకల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ కరీంనగర్ డీఈఈ ఈసరి జనార్దన్, పంచాయతీ రాజ్ మెట్‌పల్లి డీఈఈ బండ రమణారెడ్డి, మానకొండూర్ డీఈఈ కర్నె రవి ప్రసాద్, పంచాయతీ రాజ్ రిటైర్డ్ డీఈఈ బొమ్మరాతి వెంకన్న, ప్రముఖ ఇంజనీర్ కొల అన్నారెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బట్టు రాజేందర్, క్లబ్ చాటర్ ప్రెసిడెంట్, కాంగ్రెస్ నాయకులు పురమల్ల శ్రీనివాస్, చింతల కిషన్ పటేల్, కామిరెడ్డి నరసింహారెడ్డి, మాసినేని చక్రధర్ పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: ది కరీంనగర్ కన్సల్‌టెంట్ సివిల్ ఇంజనీర్స్ అండ్ ఆర్కిటెక్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే నిర్వహించారు. అనంతరం నగరంలోని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి సురేశ్‌బాబు, రమేశ్, రంజిత్, శివతేజ, వెంకటేశ్, సంతోష్ తదితర ఇంజనీర్లు రక్తదానం చేశారు. అధ్యక్షుడు మర్రి రాజేశ్, ప్రధాన కార్యదర్శి దూస సురేశ్‌బాబు, కోశాధికారి పెద్ది ప్రమోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఇఫ్తకార్ అహ్మద్, పలువురు సీనియర్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్: స్థానిక టీఎన్‌జీవో భవన్‌లో టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ చైర్మెన్, టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు.



ప్రారంభిస్తున్న ప్రైవేట్ ఇంజనీర్లు